తడి, పొడి చెత్తను ప్రాసెస్ చేయాలి



చెత్తతో ఎరువుల తయారీ విధానాన్ని తెలుసుకున్న సీడీఎంఏ శ్రీదేవి

మణికొండ: ప్రతి ఇంటి నుంచి వెలువడుతున్న చెత్తను తడి, పొడి రూపంలో సేకరించి మున్సిపాలిటీ పరిధిలోనే దాన్ని రీసైక్లింగ్ చేసి ఎక్కడి చెత్తను అక్కడే తిరిగి ఉపయోగించాల్సిన అవసరం ఎంతో ఉందని రాష్ట్ర మున్సిపల్ శాఖ అడ్మినిస్ట్రేషన్ కమిషనర్, డైరెక్టర్ (సీడీఎంఏ) డాక్టర్ టీకే. శ్రీదేవి అన్నారు. మంగళవారం ఆమె నార్సింగి మున్సిపాలిటీ, వట్టినాగులపల్లి చెత్త డంపింగ్ యార్డులో తడి, పొడి చెత్తలను వేరు చేసే పద్ధతి, వాటిని తిరిగి వర్మికంపోస్టు ఎరువులుగా తయారు చేస్తున్న విధానాలను మున్సిపల్ కమిషనర్ టి. కృష్ణమోహన్‌రెడ్డిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నార్సింగి తరహాలోనే ప్రతి మున్సిపాలిటీ పరిధిలోను తడి, పొడి చెత్త ప్రాసెస్ నిర్వహించాల్సిన అవసరం ఎంతో ఉందన్నారు. దీంతో చెత్త పేరుకుపోయి పర్యావరణానికి, ప్రజలకు దుర్గంధం సమస్య ఉండదన్నారు. అందుకు అనుగుణంగా అధికారులు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ శాఖ జాయింట్ డైరెక్టర్ ఫల్గుణ్‌కుమార్, నార్సింగి మున్సిపాలిటీ మేనేజర్ యోగేష్, డీఈ నరేష్, ఏఈ శ్రీనివాస్, టీపీఎస్ మణిహారిక, శానిటరీ ఇన్‌స్పెక్టర్ లచ్చిరాం తదితరులు పాల్గొన్నారు.



పారిశుద్ధ్య కార్మికులతో మాట్లాడుతున్న శ్రీదేవి

సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ రిసోర్స్ పార్క్ పరిశీలన

బండ్లగూడ: బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయాన్ని మంగళవారం మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ కమిషనర్ అండ్ డైరెక్టర్ డాక్టర్ టి.కె.శ్రీదేవి సందర్శించారు. కమిషనర్ బి.శరత్ చంద్ర ఆమెకు పూల మొక్క అందజేసి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా శానిటేషన్, ట్రేడ్ లైసెన్స్, ప్రాపర్టీ ట్యాక్స్ కలెక్షన్, ఎల్ఆర్ఎస్ అంశంపై సమీక్షించారు. అనంతరం బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ రిసోర్స్ పార్క్‌ను పరిశీలించారు. సోర్స్ సెగ్రిగేషన్, కంపోస్ట్ పద్ధతి ద్వారా ఎరువు తయారీ చేసే ప్రక్రియ మెరుగుపరచాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జేడీ ఫాల్గునకుమార్, మున్సిపల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రాజ్యాంగ దినోత్సవం

మణికొండ: రాజ్యాంగ దినోత్సవాన్ని మంగళవారం మణికొండ, నార్సింగి మున్సిపాలిటీల పరిధిలో పలువురు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మణికొండ మున్సిపాలిటీ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు, ది సిటిజన్ కౌన్సిల్ అధ్యక్షుడు డి.సీతారాం, నార్సింగి మున్సిపాలిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు కె. అశోక్‌యాదవ్, గండిపేటలోని మహాత్మా గాంధీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎంజీఐటీ) కళాశాల వైస్ ప్రిన్సిపాల్ కె.సుధాకర్‌రెడ్డి ఆయా కార్యక్రమాల్లో మాట్లాడారు. మన దేశాన్నిహి హిమాలయ పర్వతాలు ఎలా కాపాడుతున్నాయో దేశంలోని ప్రతి పౌరునికి మన రాజ్యాంగం రక్షణగా నిలుస్తుందన్నారు. మణికొండ మున్సిపాలిటీ, నెక్నాంపూర్‌లో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో అంబేడ్కర్, బాబూ జగ్జీవన్‌రాం విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించి రాజ్యాంగ పుస్తకాలను పంపిణీ చేశారు. నార్సింగిలో జరిగిన కార్యక్రమంలో అంబేడ్కర్ విగ్రహానికి కాంగ్రెస్ నాయకులు నివాళులర్పించారు. ఎంజీఐటీలో విద్యార్థులు ర్యాలీ నిర్వహించి రాజ్యాంగాన్ని పరిరక్షిస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఆయా కార్యక్రమాల్లో బీఆర్ఎస్ ఉపాధ్యక్షుడు ఎ. లక్ష్మణ్‌రావు, వర్కింగ్ ప్రెసిడెంట్ కె. ధన్‌రాజ్, సిటిజన్ కౌన్సిల్ ప్రధాన కార్యదర్శి షేక్ ఆరీఫ్ మహ్మద్, నార్సింగిలో మార్కెట్ కమిటీ చైర్మన్ వేణుగౌడ్, నాయకులు ప్రవీణ్‌యాదవ్, శ్రీనివాస్, రాము, వినోద్‌కుమార్, డి.లక్ష్మణ్, పొన్న రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కొండా లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయంలో..

ఏజీవర్సిటీ: కొండా లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయంలో మంగళవారం రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అసోసియేట్ డీన్ ప్రశాంత్, కళాదర్‌బాబు, సంతోషిని, నాగహర్షిత, మానస, జెన్ని, శ్రీరాములు, వేణుగోపాల్, శ్రీనాథ్, మేఘన, రజిత, పూజ పాల్గొన్నారు.



ఎంజీఐటీలో..

ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో..

శంషాబాద్: ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో శంషాబాద్ పట్టణంలో రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. హమారా సంవిధాన్..హమారా స్వాభిమాన్ నినాదాలతో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎన్ఎస్‌యూఐ జాతీయ అధ్యక్షుడు వరుణ్‌చౌదరి, రాష్ట్ర అధ్యక్షుడు వెంకటస్వామి, రాష్ట్ర కార్యదర్శి ఆనంద్ మాట్లాడుతూ.. రాజ్యాంగం కల్పించిన హక్కులను పౌరులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ప్రతి విద్యార్థి రాజ్యాంగాన్ని విధిగా చదవాలి..

రాజేంద్రనగర్: ప్రతి విద్యార్థి రాజ్యాంగాన్ని విధిగా చదవాలని లంగర్‌హౌస్ ఇన్‌స్పెక్టర్ రఘు కుమార్ అన్నారు. ప్రేమావతిపేట్ ప్రాథమిక పాఠశాలలో సోమవారం నిర్వహించిన రాజ్యాంగ దినోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు రాజ్యాంగం ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌జీఓ సభ్యులు కె.ఎస్.రెడ్డి, క్రాంతి వర్మ, శ్రీనివాస్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మునీరా బేగం, టీచర్లు సరిత, రేణుక, అంగన్‌వాడీ టీచర్ వినోద తదితరులు పాల్గొన్నారు.



బహుమతులను ప్రదానం చేస్తున్న లంగర్‌హౌస్ ఇన్‌స్పెక్టర్ రఘు కుమార్



నార్సింగిలో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించిన కాంగ్రెస్ నేతలు



కొండా లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయంలో..



నెక్నాంపూర్‌లో నివాళులర్పించిన బీఆర్ఎస్ నాయకులు



శంషాబాద్ పట్టణంలో నివాళులర్పించిన ఎన్ఎస్‌యూఐ నాయకులు

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

మణికొండ: పుప్పాలగూడ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో బుధవారం మెయింటెనెన్స్ పనులు చేపడుతున్నందున ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నామని ఏఈ సంతోష్‌కుమార్ తెలిపారు. అలకాపూర్ టౌన్‌షిప్, బాలాజీనగర్, సెక్రటేరియట్ కాలనీ, పుప్పాలగూడ గ్రామం, దుర్గానగర్, రాఘవేంద్ర కాలనీ, మారుతినగర్, కేపీఆర్ కాలనీ, గోల్డన్ ఓరియల్, ఎల్ఐసీ కాలనీ, బీఆర్‌సీ అపార్ట్‌మెంట్స్, వినాయకనగర్, సాయి చంద్ర కాలనీ, సాయి గౌతమ్ కాలనీ, ఏజీఎల్, మణికొండ గార్డన్, సుందర్‌గార్డన్ ప్రాంతాలో ప్రకటిత సమయంలో విద్యుత్ సరఫరా ఉండదని ఆయన వివరించారు.

రాజేంద్రనగర్: శివరాంపల్లి విద్యుత్ సెక్షన్ పరిధిలోని బాబుల్‌రెడ్డి నగర్, ఎన్టీఆర్‌నగర్, హసన్‌నగర్, సాయిబాబానగర్ విద్యుత్ ఫీడర్ల పరిధిలోని వివిధ ప్రాంతాల్లో విద్యుత్ మరమ్మతుల కారణంగా బుధవారం విద్యుత్ సరఫరా ఉండదని శివరాంపల్లి విద్యుత్ సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ నవీన్ ఓ ప్రకటనలో తెలిపారు. రాఘవేంద్ర కాలనీ, కింగ్స్ కాలనీ, ఎన్పీ కాలనీ, వీకర్ సెక్షన్ కాలనీ, ఎన్టీఆర్‌నగర్, శివరాంపల్లి, ఆరాంఘర్, మార్కండేయనగర్, ప్రశాంత్ కాలనీ, ప్రజాభవన్, శ్యామలనగర్, శాలిటైర్ స్కూల్ ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయ ఉంటుందన్నారు. శివరాంపల్లి విద్యుత్ సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ నవీన్ తెలిపారు.

చెత్తను వేరు చేసి అందించాలి



చెత్త సేకరణ పనులను పరిశీలిస్తున్న కమిషనర్ శరత్‌చంద్ర

బండ్లగూడ: ప్రజలు తమ ఇంట్లోని చెత్తను వేరు చేసి ఇంటి వద్దకు వచ్చే చెత్త సేకరణ కార్మికులకు అందించాలని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ బి.శరత్‌చంద్ర సూచించారు. ఇందిరారెడ్డినగర్, హిమగిరినగర్, శాంతినగర్ కాలనీలలో తడి, పొడి చెత్త సేకరణ పనులను ఆయన పరిశీలించారు. ప్రజలు తడి చెత్తను ఆకుపచ్చ రంగు డబ్బాలో, పొడి చెత్తను నీలం రంగు డబ్బాలో, హానికర చెత్తను ఎరుపు రంగు డబ్బాలలో వేరు చేసి ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో శానిటరీ జవాన్లు రామంజులు, మల్లేష్, సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



తెలంగాణ పోలీస్ అకాడమీ ప్రాంతంలో స్పెషల్ డ్రైవ్ చేపడుతున్న ట్రాఫిక్ పోలీసులు

బండ్లగూడ: ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని నార్సింగి ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ ఎస్సైలు లింగంనాయక్, రాజేష్‌గౌడ్ పేర్కొన్నారు. మంగళవారం తెలంగాణ పోలీస్ అకాడమీ ప్రాంతంలో వాహనాల స్పెషల్ డ్రైవ్‌ను చేపట్టారు. ఈ సందర్భంగా నెంబర్ ప్లేట్లు లేని పది వాహనాలను సీజ్ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ..వాహనాలు నడిపే సమయంలో హెల్మెట్ ధరించాలని, సీట్ బెల్టు వేసుకోవాలన్నారు. మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దన్నారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ సిబ్బంది ఉన్నారు.

చిన్ననాటి నుంచే విద్యార్థులకు సేవాగుణం ఉండాలి



మాట్లాడుతున్న రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి. నారాయణరెడ్డి

మైలార్‌దేవ్‌పల్లి: చిన్ననాటి నుంచే విద్యార్థులకు సేవాగుణం ఉండాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి అన్నారు. మంగళవారం మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పద్మశాలిపురంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 'ది స్మార్ట్ లైబ్రరి ఇనిషిటివ్'కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు గ్రంథాలయం ఏర్పాటుకు తోడ్పాటు అందించిన కుమారి అధిరై రోస్‌కు ప్రత్యేక అభినందనలు తెలిపారు. ప్రతి ఒక్కరూ పుస్తకాలను చదువడం వల్ల మెరుగైన జ్ఞానాన్ని సంపాదించవచ్చని పేర్కొన్నారు. ప్రతి విద్యార్థి విద్యార్థిని చిన్ననాటి నుంచే క్రమశిక్షణకు మారుపేరుగా నిలిచి తల్లదండ్రులకు సేవ చేస్తూ సమాజానికి ఏమి చేయగలమనే ఆలోచన శక్తి రావాలని కోరారు. ఉదాహరణకు కలెక్టర్ రోనాల్డ్ రోజ్ కూతురే నిలిస్తుందన్నారు. 10వ తరగతి చదువుతూ సమాజానికి నేను ఎలాంటి సేవ చేయాలనే సంకల్పం కలిగినందుకు వారి తల్లిదండ్రులు గర్వపడుతున్నారన్నారు. చిన్నారి సేవా స్ఫూర్తికి మెచ్చి పాఠశాలకు లైబ్రెరీ బుక్స్ అందించడంపై ఆకర్శితులై వచ్చానన్నారు. ప్రతి పాఠశాలలో లైబ్రెరి ఉండాలి పుస్తకం ద్వారా మన వ్యక్తిత్వంలో అనేక మంచి ఆలోచన శక్తిని పెంచడంతో పాటు ఆలోచన విధానాన్నే మార్చుతుదన్నారు. రాజేంద్రనగర్ ఎంఈఓ శంకర్ నాయక్, నిర్మాణ్ ఆర్గనైజేషన్ మయూర్ పట్నాల, తహసీల్దార్ రాములు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు రవి, ఉపాధ్యాయులు రూప, కిరణ్, సాదత్ అలీ, రాజు, మాధవి, రాములు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరం

బండ్లగూడ: సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరమని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ అన్నారు. బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ 7వ డివిజన్ కాలనీకి చెందిన సయ్యద్ హష్మత్ అలీకి సీఎం సహాయ నిధి ద్వారా మంజూరైన రూ.38 వేల చెక్కును మంగళవానం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఆపదలో ఉన్న వారిని ఆదుకునేందుకు సీఎం సహాయ నిధి ఉపయోగపడుతుందన్నారు. పేద ప్రజల ఆసుపత్రి ఖర్చుల కోసం సీఎం సహాయ నిధికి దరఖాస్తు చేసుకున్న వెంటనే నిధులు మంజూరు చేయిస్తున్నామన్నారు. సరైన ధ్రువపత్రాలు సమర్పిస్తే సహాయ నిధి త్వరగా వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పాపయ్యయాదవ్ తదితరులు పాల్గొన్నారు.



చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్

మాలల సింహ గర్జనను విజయవంతం చేయండి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మాల సంఘాల ప్రతినిధులు

రాజేంద్రనగర్: డిసెంబర్ 1న నిర్వహించిన మాలల సింహ గర్జన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మాల సంఘాల ప్రతినిధులు పిలుపునిచ్చారు. రాజేంద్రనగర్ నియోజకవర్గం పరిధి రాజేంద్రనగర్ అంబేడ్కర్ చౌరస్తాలో మంగళవారం మాలల సింహ గర్జనకు సంబంధించిన కరపత్రాలు, వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రతినిధులు మాట్లాడుతూ..డిసెంబర్ 1న నిర్వహించిన మాలల సింహ గర్జన కార్యక్రమానికి పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మాలల ప్రతినిధులు పచ్చ నర్సింగ్ రావు, మంత్రి చంద్రశేఖర్, గొడుగు సంజీవ, పంబల రాజు, పత్యారా నరసింహ, పెండ్యాల జంగయ్య, అజయ్, శంకర్, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు: ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: అర్హులందరికీ సంక్షేమ పథకాలు తప్పకుండా అందుతాయని ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. మంగళవారం ఆయన హకీంపేట్‌లో గోల్కొండ, ఆసిఫ్‌నగర్ మండలాలకు చెందిన కల్యాణలక్ష్మి, షాదీముబాకర్ చెక్కులను లబ్ధిదారులకు అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..కార్వాన్ నియోజకవర్గంలో అత్యధికులు నిరుపేదలే అని అన్నారు. గత పదేళ్లల్లో తాను ఎమ్మెల్యేగా ఉంటూ నియోజకవర్గ పరిధిలోని వేలాది మంది నిరుపేదలకు వివిధ రకాల సంక్షేమ పథకాలు మంజూరు చేయించానన్నారు. ఈ కార్యక్రమంలో టోలిచౌకీ డివిజన్ మజ్లిస్ అధ్యక్షుడు హారూన్‌ఫరాన్, అలీముద్దీన్, మజీద్‌ఖాన్ తదితరులున్నారు.

8న 'శాంతిసరోవర్'లో ప్రత్యేక సదస్సు

రాయదుర్గం: శాంతిసరోవర్‌లోని గ్లోబల్ పీస్ ఆడిటోరియంలో డిసెంబర్ 8న ప్రత్యేక సెమినార్‌ను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు వ్యాపార, వాణిజ్య రంగాలకు చెందిన వారికి 'పర్సనల్ ఎక్సలెన్స్ ఫర్ బిజినెస్ స్ట్రాటజీ అండ్ సక్సెస్' అనే అంశంపై ప్రత్యేక ఉపన్యాస కార్యక్రమం ఉంటుంది.అనంతరం మెడిటేషన్ తదితర కార్యక్రమాలు నిర్వహిస్తారు. శాంతి సరోవర్ డైరెక్టర్ బికె కుల్‌దీప్ దీదీ ఆధ్వర్యంలో సాగే ఈ కార్యక్రమంలో శాంతా బయోటెక్ లిమిటెడ్ వ్యవస్థాపకుడు, చైర్మన్ పద్మభూషణ్ డాక్టర్ వరప్రసాద్‌రెడ్డి, ఐసీఏ ఇండియా ఫెలో మెంబర్ రామకృష్ణ చౌదరి, టర్కీ బ్రహ్మకుమారీస్ లీడర్‌షిప్ డెవలప్‌మెంట్ ట్రైనర్, డైరెక్టర్ యోగేష్ శార్మా, మౌంట్‌అబూ ఆర్ట్ కోఆర్డినేటర్ డేవిడ్ కిలో స్పీక్స్ వంటివారు పాల్గొంటారు. లైవ్ మ్యూజిక్ ఉంటుంది. కార్యక్రమంలో పాల్గొనే వారు తమ పేర్లను నమోదు చేసుకోవాలి. మరిన్ని వివరాలకు ఫోన్ నంబర్ 8087411206లో సంప్రదించాలని నిర్వాహకులు కోరారు.

నేడు వాహనాల వేలం

రాజేంద్రనగర్: శంషాబాద్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో గతంలో నార్కోటిక్ డ్రగ్స్ (గంజాయి) అక్రమ రవాణాలో వినియోగించి పట్టుబడిన ద్విచక్ర, త్రిచక్ర (ఆటోలు) వాహనాల వేలాన్ని ఈ నెల 27న నిర్వహించనున్నట్లు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ జి.దేవేందర్ రావు తెలిపారు. బుధవారం మధ్యాహ్నం 12 గంటల స్టేషన్ ఆవరణలో నిర్వహించనున్నామన్నారు. ఆసక్తి గల ఈ వేలంలో పాల్గొని వాహనాలను పొందాలన్నారు.

రేపు మహాత్మా జ్యోతిరావు పూలే వర్ధంతి

రాజేంద్రనగర్: మహాత్మా జ్యోతిరావు పూలే వర్ధంతిని గురువారం నిర్వహించనున్నట్లు రాజేంద్రనగర్ మహాత్మా జ్యోతిరావు పూలే జయంత్యుత్సవ కమిటీ వ్యవస్థాపక అధ్యక్షుడు కె.కృష్ణమాచారి వెల్లడించారు. మంగళవారం రాజేంద్రనగర్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ..రాజేంద్రనగర్‌లోని మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహం వద్ద వర్ధంతి కార్యక్రమాన్ని గురువారం ఉదయం 9 గంటలకు నిర్వహించినట్లు వెల్లడించారు. ఈ వర్ధంతి కార్యక్రమానికి పార్టీలకు అతీతంగా అందరూ హాజరై పూలే విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ అధ్యక్షుడు అడిగే అర్జున్, సత్యనారాయణ ముదిరాజ్, కోలమీదు యాదయ్య, నారాయణ ముదిరాజ్ తదితరులున్నారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనుల ప్రారంభం

చాంద్రాయణగుట్ట: జంగమ్మెట్ డివిజన్‌లోని రవీంద్రనాయక్ నగర్‌లో రూ.9 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను మంగళవారం బీజేపీ ఎస్టీ మోర్చా భాగ్యనగర్ జిల్లా అధ్యక్షుడు వి.గోపి నాయక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..రవీంద్రనాయక్ నగర్‌లో నెలకొన్న సమస్యలతో ప్రజలు నిత్యం అవస్థలకు గురవుతున్నారు. రోడ్డు సమస్యను విన్నవించిన వెంటనే జీహెచ్ఎంసీ అధికారులు మంజూరు చేయడం హర్షణీయమన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు ఆర్.రాకేష్ నాయక్, బి.ప్రమీలీ బాయి, బుజ్జి బాయి తదితరులు పాల్గొన్నారు.

ఏడాది పాలనలో రాష్ట్రం అధోగతి పాలు

మాజీ మంత్రి సబితారెడ్డి



మాట్లాడుతున్న సబితారెడ్డి

శంషాబాద్: సీఎం రేవంత్‌రెడ్డి ఏడాది పాలనలో రాష్ట్రం అధోగతి పాలైందని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి అన్నారు. రాష్ట్రంలో రైతుల దగ్గరి నుంచి సామాన్యుల వరకు ఎవరు కూడా కాంగ్రెస్ పాలనపై సంతృప్తిగా లేరన్నారు. నవంబరు 29 దీక్షా దివస్ విజయవంతం కోసం మంగళవారం పట్టణంలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్ రెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో సబితారెడ్డి మాట్లాడారు. 2009 నవంబరు 29న మాజీ సీఎం కేసీఆర్ చేపట్టిన దీక్షతోనే అప్పటి కేంద్ర సర్కారు దిగివచ్చి తెలంగాణను ప్రకటించిందన్నారు. తెలంగాణ సాధనతో పాటు తెలంగాణ అభివృద్ధి పథంలో నడిపిన గొప్ప వ్యక్తి కేసీఆర్ అన్నారు. కేసీఆర్ తెలంగాణను సాధించడంతో ఇప్పుడు కొందరు పదవులు అనుభిస్తున్నారన్నారు. మాజీ డిప్యూటీ సీఎం మహ్మూద్ అలీ, మాజీ ఎమ్మెల్యేలు జైపాల్‌యాదవ్, అంజయ్య యాదవ్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు పట్లోళ్ల కార్తీక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్ప మహా పడిపూజ



మహా పడిపూజలో ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ తదితరులు

మణికొండ: అయ్యప్ప నామస్మరణతో కోకాపేట గ్రామం మారు మ్రోగింది. స్థానిక కౌన్సిలర్, పెరియస్వామి అరికె దుర్గేష్‌యాదవ్, గురుస్వామి గోపాల సంజీవ్‌కుమార్, గురుస్వామి రాము యాదవ్ నేతృత్వంలో మంగళవారం పెద్ద ఎత్తున అయ్యప్ప మహా పడిపూజను గురుస్వామి కేశవ శర్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా 18 మెట్ల పడిని కాల్చారు. అయ్యప్ప స్వామిని పల్లకీలో ఊరేగించారు. అనంతరం పెద్ద ఎత్తున అన్నదానం నిర్వహించారు. మహా పడిపూజలో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ మాట్లాడుతూ..అయ్యప్ప భక్తులు ప్రతి సంవత్సరం పెరిగిపోతున్నారన్నారు. ఎంతో నిష్టతో 41 రోజుల పాటు అయ్యప్పను కొలవడం శుభపరిణామన్నారు. ఈ కార్యక్రమంలో నార్సింగి మున్సిపల్ చైర్‌పర్సన్ మైలారం నాగపూర్ణ శ్రీనివాస్, వైస్ చైర్మన్ విజయ్ బాబు, నార్సింగి మార్కెట్ కమిటీ చైర్మన్ వేణుగౌడ్, టీపీసీసీ సభ్యుడు ముంగి జైపాల్‌రెడ్డి, నార్సింగి మున్సిపాలిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు కె.అశోక్‌యాదవ్, మాజీ ఎంపీపీ తలారి మల్లేష్ తదితరులతో పాటు పెద్ద ఎత్తున అయ్యప్ప మాలాధారులు భక్తులు పాల్గొన్నారు.

మైత్రి కమిటీ సభ్యులు మరింత క్రియాశీలకంగా పని చేయాలి

గోల్కొండ: మైత్రి కమిటీ సభ్యులు మరింత క్రియాశీలకంగా పని చేయాలని గోల్కొండ డివిజన్ ఏసీపీ సయ్యద్ ఫయాజ్ అన్నారు. మంగళవారం పీస్ అండ్ మైత్రి కమిటీ సభ్యులతో కలిసి ఆయన గోల్కొండ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులకు మైత్రి కమిటీ సభ్యులు ఎంతగానో సహకరిస్తున్నారన్నారు. కొంత కాలం నుంచి ప్రార్థనా స్థలాలు, ఆలయాల వద్ద సీసీ కెమెరాల ఏర్పాటుకు చేసుకోవాలని నిర్వాహకులను కోరుతున్నామన్నారు. ఇంకా ఎన్నో ప్రార్థనా స్థలాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు కాలేదని ఆయన అన్నారు. సీసీ కెమెరాలు ఉంటే నేరస్థులను వెంటనే పట్టుకో వచ్చునని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా పీస్ కమిటీ సభ్యులు ఆయనను సన్మానించారు. రాజు వస్తాద్, ఏ.పరమానందం, నర్సింహా, ఆబేద్, ఆజామ్‌ఖాన్ తదితరులున్నారు.



గోల్కొండ ఏసీపీ సయ్యద్ ఫయాజ్‌ను సన్మానిస్తున్న దృశ్యం

ఉత్సాహంగా కేక్ మిక్సింగ్



ది హడల్‌లో కేక్ మిక్సింగ్‌లో పాల్గొన్న భాగస్వాములు

మణికొండ: క్రిస్మస్ పండగ, కొత్త సంవత్సరం వేడుకల సీజన్‌కు స్వాగతం పలికే కేక్ మిక్సింగ్ కార్యక్రమాన్ని మంగళవారం పుప్పాలగూడ రెవెన్యూ పరిధిలో ది హడల్ రెస్టారెంట్ వారు ఉత్సాహం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వెంకటేశ్వర హోటల్స్ భాగస్వాములు మోనిష్, ఆర్వీ రాజగోపాల్, జనరల్ మేనేజర్ శైలేష్‌కుమార్ మాట్లాడుతూ.. రాబోయే పండగలు, ఉత్సవాలకు తమ ది హడల్ సంసిద్ధంగా ఉందన్నారు. క్రిస్మస్, నూతన సంవత్సరం వేడుకల సంతోషాలకు కేక్ మిక్సింగ్ ప్రారంభ సూచకమన్నారు. తమ రెస్టారెంట్ ఈవెంట్‌లను నిర్వహించేందుకు ఎదురు చూస్తుందన్నారు. తమ ది హడల్‌లో స్పోర్ట్స్ బార్, అధునాతన కిచ్ లీగ్ ఉందన్నారు.

కోతుల బెడదను నివారించండి



సెక్రటేరియట్ కాలనీలోకి వచ్చిన కోతుల గుంపు

మణికొండ: అడవులు, పల్లెటూర్లలో ఉండాల్సి కోతులు పట్టణాల్లోకి వచ్చి ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. ఇప్పటికే వీధి కుక్కలతో వేగలేని పరిస్థితి ఉంటే వాటికి తోడుగా కోతుల గుంపు చేరింది. దీంతో మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలకు బయటకు వస్తే కుక్కల బాధ, ఇంట్లో ఉంటే కోతుల బాధ అన్న చందంగా మారిపోయిందని పలు కాలనీల ప్రజలు వాపోతున్నారు. మున్సిపాలిటీ పరిధిలోని సెక్రటేరియట్ కాలనీ, లాలమ్మగార్డన్, ఫ్రెండ్స్ కాలనీ, హుడా కాలనీ తదితర ప్రాంతాల్లో కోతుల గుంపు ఏకంగా గృహాల్లోకి చొరపడి చేతికి అందినవి తీసుకుని వెళ్తున్నాయని ఆయా కాలనీల వాసులు తెలిపారు. ఇటీవల ఒకటి, రెండు నుంచి ఇప్పుడు ఏకంగా అవి పదుల సంఖ్యకు పెరిగాయని వారు వివరించారు. మున్సిపాలిటీ వారు వాటిని పట్టుకుని ఎటైనా దూర ప్రాంతంలో వదిలేసే ప్రయత్నం చేయాలని కోరుతున్నారు.

28న 'ఎస్కీ'లో అంతర్జాతీయ సెమినార్

రాయదుర్గం: గచ్చిబౌలిలోని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా (ఎస్కీ) ఆధ్వర్యంలో ఈనెల 28వ తేదీన అంతర్జాతీయ సెమినార్ జరుగుతుందని 'ఎస్కీ' డైరెక్టర్ డాక్టర్ జి రామేశ్వరరావు తెలిపారు. ఎస్కీ క్యాంపస్‌లోని సెంటినరీ కన్వెన్షన్ సెంటర్‌లో ఉదయం 10.30 గంటలకు 'ఇన్నోవేషన్స్ ఇన్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ ఫర్ సస్టేనబుల్, డెవలప్‌మెంట్' (ఐఈటీఎస్‌డీ-2024) అనే అంశంపై సెమినార్ ఉంటుందన్నారు. ఇన్‌స్టిట్యూషన్ ఆఫ్ ఇంజనీర్స్ ఇండియా అధ్యక్షుడు డాక్టర్ జి రంగనాథ్ అధ్యక్షతన జరిగే ఈ కార్యక్రమ ప్రారంభ సమావేశంలో ముఖ్య అతిథిగా సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొంటారన్నారు.